చంద్రం పడక గదిలోకి వచ్చి, క్రింద చాపపై పడుకున్న సరితను చూచి ముఖం చిట్లించాడు. బయట యెంతో హాయిగా ఉంది వాతావరణం. వసంత ఋతువు ఆగమనం తెలుపుతూ కోయిలలు కూస్తున్నాయి. ఒక పక్క ఉక్క, మరో వంక శరీరానికి చెప్పలేనిహాయి కల్గుతుంటే గదిలో అడుగుపెట్టాడు.

"సరూ....ఏయ్! అలకా?"

జవాబుగా వెక్కిళ్లు వినిపించాయి.

అతను ఒక్క క్షణం ఆలోచించాడు. తనంటే నిజంగా సరితకు అభిమానంలేదా? ఏమో, తనిద్దరు బిడ్డల తండ్రి. కన్యగా ఆమె యెన్ని కలలు కన్నదో!

అతని మనసంతా అదో మాదిరిగా మారిపోయింది. తన ఆవేదన అర్థం చేసుకునే వారేరి? అనసూయతో తన వివాహం అయితే అయిందిగాని, ఆమెతో తాను గడిపిన రోజులు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. వివాహం అయిన మూడు సంవత్సరాలలో ఇద్దరు బిడ్డలు కల్గారు. అనసూయ అంతిమ శ్వాస పీల్చింది. గాఢంగా నిట్టూర్చాడు.

"సరూ! ఏమయింది?" మెల్లగా ఓదార్పుగా అడిగాడు సరితను. దగ్గరగా వెళ్ళి ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

"ఏం లేదు. ఏం లేదండీ." అన్నది కళ్లు ఒత్తుకుని.

"కన్నీరు పెడుతూనే ఏం లేదు అంటే నమ్మతాననే...." అన్నాడు.

ఆమె ఏదో అనబోయి కిటికీ వైపు భయంగా చూచింది.

ఒక్క నిముషం అర్థంకానట్టు చూచి లేచాడు. కిటికీ వేయబోయాడు. కిటికి దగ్గర నిలబడిన శాల్తీ కదిలినట్టు అయింది. యెవరయి ఉంటారు? అతనికి ఊహించటానికికూడా అవకాశం దొరకలేదు. కిటికీ వేసాడు,

"ఏమండీ, క్రిందే బావుంది." అన్నది దుప్పటి పరిచి, రెండు దిండ్లు వేసి, అతనొచ్చి ఆమె ప్రక్కన ఒరిగాడు. అతని చుట్టూ పడిన చేయి ఎర్రని మట్టిగాజులతో అందంగా కనిపించింది.

"బంగారు గాజులు ఏవీ?" అన్నాడు.

"నాకు బంగారమంటే ఇష్టం లేదు. అయినా నా అలంకారాల గురించి మీకెందుకు? మీరు పైజామా వేసినా, ప్యాంటు వేసినా అడిగానా?" అన్నది చిన్నగా నవ్వుతూ.

"పిట్ట కూతకొచ్చిందే..."


"కాబట్టే మీ ప్రక్కనుంది" అన్నది.

అతను ఆవేశంగా దగ్గరకు లాక్కున్నాడు.

ఉదయం నాల్గుగంటలకే లేచి వెళ్తున్న సరితను చూచి అతను చికాకు పడ్డాడు. ఈ ఇంట్లో తనకే స్థానం ఉందో సరితకు తెలియదు అనుకున్నాడు. అత్తతో చెప్పాలి. తను చెప్పటం ఏమిటి? అత్తకు చూచాయగా ఈ విషయం తెలిస్తే తనే మందలిస్తుంది అను

# ఓ తల్లి కథ

## మాదిరెడ్డి సులోచన



కున్నాడు. అతను లేచి వచ్చేసరికి సరిత గిన్నెలు తొలుస్తుంది.

"అప్పుడే లేచారా?" నవ్వుతూ చేతులు కడుక్కుంది.

"ఇదిగో కాఫీ నాయనా! ఏమిటమ్మా సరితా, అన్ని పనులకన్నా అల్లుడి సేవ ముఖ్యం అన్నానా" మందలించి తనే కాఫీ ఇచ్చింది లక్ష్మీనర్సమ్మ. సరిత తల వంచుకుంది.

కాఫీ త్రాగుతూ కళ్ళు చికిలించాడు చంద్రం. సరిత గిన్నెలు సర్ది వంటకు ఉపక్రమించింది.

"వంటావిడకు ఏదో రోగమట. నీకెందుకమ్మా సరితా వెళ్ళి అబ్బాయిపని చూడు" అన్నది పెద్దావిడ.

"అలాగే. వంట మీరేం చేస్తారు..." అంటూ అక్కడే ఉండిపోయింది.

చంద్రం గదిలోకి వచ్చి, తన పనులు చేసుకుంటూ ఏ చిన్న శబ్దం అయినా సరితే అని చూస్తున్నాడు. ఒకసారి బయటికి తొంగి చూచాడు.

సరిత పిల్లలకు స్నానాలు చేయిస్తూంది.

"సరితా నా బట్టలు..." అరిచాడు. పిచ్చి దానవపోతే పనిపిల్లవి దిగా అనుకున్నాడు.

అయిదు నిమిషాల తర్వాత పమిటకు చేతులు తుడుచుకుంటూ వచ్చి బట్టలు తీసి పెట్టింది. మెడలో పసుపుతాడు, చెవులకు తన పుట్టింటినుండి తెచ్చుకన్న రింగులు తప్ప ఏం లేవు

"ఏమండీ...." అతని తలకు నూనె రాస్తూ పిలిచింది.

"చెప్పండి" అన్నాడు ఇటు తిరిగి, ఆమె నడుము చుట్టూ చేతులు వేసి. సరితంటే అతనికి విపరీతమైన అభిమానం, ఆరాధన.

"ఈరోజు జీతాలు కదూ! నాకు తేలికగా వుండేవి, నలభై, యాభై లోపున రెండు నూలు చీరలు తెచ్చి పెట్టండి" అన్నది.

"అదేం, బీరువానిండా ఉన్నాయిగా" అన్నాడు.

"అవన్నీ కంచి, గద్వాల, బెర్లిన్, బెరీన్ చీరలు ఖరీదు అయినవి నాకంతగా నచ్చవండి" అన్నది.

అప్పుడు భార్యను పరీక్షగా చూచాడు. మామూలు నేతచీర అతి సాధారణమయింది కట్టుకుంది. తను లక్షాధికారి. అతను తల పంకించాడు. అవన్నీ అనసూయ చీరలనే అవమానపడుతుందేమో. అంతే అయివుంటుంది. ఏం ఆడవారు! అనుకున్నాడు.

ఆ సాయంత్రం మూడు నాల్గు చీరలు తీసుకువచ్చాడు.

రాత్రి భోజనాలు వడ్డిస్తూ లక్ష్మీనరసమ్మ నిట్టూర్చింది.

"బొత్తిగా ఈ గతిలేని పిల్లను తెచ్చి నీ గొంతుకోసానేమో బాబూ. పని తప్ప మరో ధ్యాసలేదు." అన్నది.

చంద్రం మనసు చివుక్కుమంది. చేతులు కడుక్కొని, కిటికీలోనుండి బయటికి చూచాడు. సరిత ఇప్పుడు రుబ్బుతూంది! అత్తయ్యన్నట్టు ఆ పిండి రుబ్బటం ఏమిటి? రెండు మిక్సర్లున్నాయి ఇంట్లో. చంద్రం అశాంతిగా నడవ సాగేడు. సరిత పని తీర్చుకుని వచ్చే వరకు తనకు నిదర ఆగదు. ఆ విషయం చెబితే జాలిగా చూస్తుంది. అందుకే కయ్యమయినా, వియ్యమయినా సమంగా ఉండాలంటారేమో.

రానురాను చంద్రానికి భార్యపట్ల నిరసన పెరగసాగింది. "ఏమిటో నాయనా నీకు తగిన పిల్లకాదు". అని లక్ష్మీనర్సమ్మ అన్నప్పటితో అతనికి మరింత నీరసం వస్తుంది. భార్యాభర్తల మధ్య మాటలు అరుదయి పోయాయి.

లక్ష్మీనర్సమ్మ నారాయణరావులకు అపురూపంగా పుట్టిన కూతురు అనసూయ. అనసూయా కాంప్లెక్స్ అని పెద్ద షాపింగ్ సెంటర్ నిర్మించాడు నారాయణరావు. అప్పుడే అతని బావగారు పోవటం, పెద్ద కుటుంబంతో అక్క బాధపడుతుంటే ఆఖరు కొడుకు చంద్రశేఖరాన్ని తీసుకువచ్చి, కొడుకులా పెంచాడు, లక్ష్మీనర్సమ్మ కూడా అనసూయ కంటే అల్లుడే మిన్న అన్నట్టు చూచింది. ఆమెకు తెలుసు అల్లుడిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా, తన ప్రియమైన కూతురు అత్తగారింటికి వెళ్ళాలి. అందుకే చంద్రశేఖరాన్ని అభిమానంగా చూచేవారు. అత్తమామల ఆదరణ, అనసూయ అభిమానం అతడిని ఇల్లరికం అన్న ఆలోచనకే

తావు యివ్వనివ్వలేదు.

అనసూయతో వివాహం అయిన కొద్ది రోజులకే హార్ట్ ఎటాక్ తో నారాయణ మూర్తి పోయాడు.

అందరు వేల అద్దెలు వస్తాయి. అతను బ్యాంకులో ఉద్యోగం చేసాడు. వెయ్యి రూపాయలకు పైనే అతనికి వస్తాయి. కాని అనసూయ ఆరోగ్యం అతి సున్నితం అని గ్రహించటానికి అట్టే కాలం పట్టలేదు. బెంగుళూరు హనీమూన్‌కు వెళ్లి గడిపిన వైవాహిక జీవితమే. వేపళ్లు, బెడ్ రెస్ట్, పురుడు, ఈ హీనతలంటూ గడిచింది. మొదట కొడుకు పుట్టాడు. తాత పేరు కలిసి వచ్చేలా సత్యనారాయణ అని పెట్టారు. సతీష్ అని పిలుస్తారు.

సతీష్‌కు మూడో నెల వచ్చాక, అనసూయ కాస్త హుషారుగా తిరిగింది. మూడు నాళ్ళ సుఖమే. 'నాష్ కాకి' అన్నట్టు ఆమె మళ్ళీ మామూలే. అసలు దాంపత్య జీవితం అంటే తెలియకపోతే వేరే విషయం. కాని యీ మూన్నాళ్ళ ముచ్చట ఏమిటో అర్థం కాలేదు. అప్పుడే చంద్రం స్నేహితుడు పెళ్ళి చూపులకు లాక్కు వెళ్ళాడు. పెళ్ళి కూతురు ఇద్దరికి కాఫీ, బిస్కట్లు యిచ్చింది. సరదాగా, అందంగా ఉన్న ఆ అమ్మాయి చంద్రం హృదయంలో చెరగని ముద్ర వేసింది.

కొందరిని చూడగానే చూపులు హత్తుకు పోతాయి. కాస్సేపు మాట్లాడి, అభిప్రాయం చెబుతామని వచ్చారు. ఆ అమ్మాయే సరిత. స్నేహితుడికి పెళ్ళికూతురు నచ్చిందిగాని కట్నం నచ్చలేదు. తిట్టుకొచ్చాడు చంద్రం.

మళ్ళీ కొడుకే పుట్టాడు. అనసూయ పోయింది. పిల్లలను చూసుకోవటం చాలా కష్టం అయింది. పనిమనిషిని పెట్టుకున్నారు. సంవత్సరం గడిచింది. ఒకరోజు లక్ష్మీనర్సమ్మ చంద్రశేఖరం దగ్గరకు వచ్చింది.

"చంద్రం! మనకు ప్రాప్తం లేదు కాబట్టే అనసూ పోయింది. దానితో పాటు పోతామా! నీ వయసు అయినా ఏం ముదిరిపోయిందని, ఈ పిల్లలను చూసుకోవటానికయినా ఓ స్త్రీ కావాలి నాయనా. నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకో" అన్నది.

"అత్తయ్యా...." ఆశ్చర్యంగా చూశాడు.

"అవును బాబూ. ఈనాటినుండి నువ్వు కొడుకువు. కోడలు వస్తుందనుకుంటాను" అన్నదామె. చంద్రశేఖరం పెద్దన్న కూడా ఏదో పనిమీద వొచ్చి ఈ విషయం బలపరిచాడు.

చంద్రం అడ్డు చెప్పటానికయినా అవకాశం రాలేదు. అనసూయతో తన సంబంధం యెంత! అన్న వెంట వెళ్ళి పెళ్ళికూతుర్ని చూశాడు. యెవరో కాదు. సరిత. అతని హృదయం పురివిప్పిన నెమలిలా అయింది. వారం రోజులలో సరితకు, చంద్రానికి వివాహం జరిగింది. అనసూయను లాలించినట్టే లక్ష్మీనర్సమ్మ లాలింపు చూచి ఆమెకు హృదయంలో నమస్కరించాడు.

అనుకోకుండా ఈ ఉపద్రవం ఏమిటి? సరిత ఇంత ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుతో ఉందని తెలియదు. తన దగ్గర చనువు ప్రవర్తించదు. ఎలా ఆమె భయం పోగొట్టాలో తెలియదు.

తనకు భార్యలతో సుఖపడే యోగం లేదేమో...


"చంద్రం...." లక్ష్మీనర్సమ్మ పాలుతెచ్చి, బల్లమీద పెట్టింది. అతను చటుక్కున లేచి కూర్చున్నాడు.

"మీరు తెచ్చారేం?"

"ఆ అమ్మాయికి చెప్పినా అర్థం కాదు. నీ జీవితం ఇలా నిరర్థకం కావటం నా కిష్టం లేదు బాబూ. డబ్బుంటే బయట సుఖాలు తక్కువా..." అని వెళ్ళిపోయింది. చంద్రం ఉలిక్కిపడ్డాడు.

"అత్తయ్యా! నేనంటే యెంత ప్రేమ...." అనుకున్నాడు. అతను అశాంతిగా అర్ధరాత్రివరకు గడిపాడు. మెల్లగా తలుపు తీసుకుని వచ్చాడు. ఇద్దరు బిడ్డలమధ్య నేలమీద పడుకుంది. అటు సతీష్ మంచం, ఇటు అనూప్ మంచం ఉంది. పుల్లలా కనిపించిన సరిత, పొట్ట యెత్తుగా ఉంది. అతనికేదో అనుమానం వేసింది.

"సరూ!" వెళ్ళి అరచేతితో రాశాడు.




"ఆఁ...." ఉలిక్కిపడ్డట్టు, తనను యెవరో తాకకూడని వ్యక్తి తాకినట్టు బిత్తరపోయి చూచింది.

ఆతనికి కోపం వచ్చింది. రెక్కపట్టి గదిలోకి లాక్కువచ్చాడు. లైటు వెలుగులో ఆమెను చూచి తెల్లబోయాడు. తైలసంస్కారం లేని జుట్టు. పీక్కుపోయిన దవడలు, చిరిగి, మైల పట్టిన బట్టలు. ఆమెను దగ్గరకు తీసుకోవాలంటే కూడా మనసు అంగీకరించలేదు. ఎంత విసురుగా లాక్కువచ్చాడో అంత విసురుగా బయటికి లాగాడు. ఆమె అరచేయి ముళ్లున్నట్టు గుచ్చుకుంది.

అదే చేయి పట్టుకుని అగ్నిగుండం చుట్టూ తిరిగాడు. మృదువుగా, మల్లెపువ్వులా ఉండేది.

"ఏమండీ..." అంటుండగానే హాల్లో లైటు వెలిగింది. లక్ష్మీనర్సమ్మ నిలబడింది. సరిత తరుముతున్నట్టు పిల్లల గదిలోకి వెళ్లింది.

"ఇదీ నాయనా వరస..." అన్నది జాలిగా, బాధగా.

అతను ఉక్రోషంగా తలుపు తీసుకుని బయటికి వెళ్లాడు. యెంతదూరం నడిచాడో అతనికే తెలియదు. పక్షుల కిలకిలారావం విని ఉలిక్కిపడి వెనుదిరిగాడు. ఓ రిక్షా కనిపిస్తే యెక్కి యింటికి వచ్చాడు.

"అత్తయ్యా! ఆ అమ్మాయికి విడాకులిస్తాను. వాళ్ళ నాన్నను పిలిచి పంపించెయ్యి" అన్నాడు ఇంటికి వస్తూనే, అత్త తలుపు తీయటం చూచి.

ఆ మాటనకు బాబూ! నీకు బయట సుఖాలు తక్కువా? సతీష్, అనూప్‌ల కొరకు ఆవిడ ఉండాలి" అన్నది లక్ష్మీనర్సమ్మ.

"రోజూ ఇంట్లో చూస్తూ యెలా వుండేది అత్తయ్యా?"

"ఓ పనిమనిషి అనుకో నాయనా! మనము పంపించినా పట్టెడన్నం పెడతాడనుకోను ఆ తండ్రి" అన్నది.

చంద్రం మరింత ఉదాసీనంగా మారిపోయాడు.

ఆ రోజు ఏజెంటుగారింట్లో పార్టీ. రాత్రికి ఆలస్యంగా వస్తానని బయలుదేరాడు చంద్రం. వీధిచివరకు వెళ్లగానే స్కూటర్ పాడయింది. స్కూటర్ నెట్టుకుంటూ వెళ్లి, దగ్గరలో ఉన్న గరాజులో పెట్టాడు. చమటతో బట్టలన్నీ తడిసిపోయాయి. మెల్లగా ఇంటికి వచ్చాడు. వాకిట్లోకి వినిపించే లక్ష్మీనర్సమ్మ గర్జన, సరిత దీనమైన గొంతు వినిపించాయి. అక్కడే

కుర్చీలో కూర్చుండిపోయాడు.

"ఒళ్లో అబ్బాయిముందు వయ్యారాలు పోయావంటే ఇంజక్షన్ ఇస్తాను. మొన్న రాత్రి అతని గదికి యెందుకు వెళ్లావ్?"

"నేను వెళ్లలేదమ్మా. ఆయన 'చెయ్యిపట్టి లాగేవరకు నాకు తెలియదు" అన్నది దీనంగా.

"ఇన్ని రోజులుగా లేనిది నీపై కోరిక పుట్టుకు వచ్చిందా" అతన్ని ఆకర్షించటానికి ఏదో వేషం వేసావు కవునా? అన్నది కోపంగా.

"లేదమ్మా నాకే పాపం తెలియదు. ఆయన నేను పని చేస్తుండగా వచ్చినా నేను తలెత్తి చూడటం లేదు" అన్నది వెక్కుతూ.

"చూస్తే అనుభవిసావ్" ఆడది వరండాలో కూర్చున్న అల్లుడిని చూడగానే చరచర బయటికి వెళ్లింది.

చంద్రానికి కొంత అర్థం అయినట్టు, కానట్టు వుంది. గదిలోకి వెళ్ళి ఆ చీకట్లో అలాగే మంచంపై వాలిపోయాడు. పార్టీ సంగతే మరచిపోయాడు. తలపై వేయిసమ్మెట పోట్లు పడ్డట్టు అయింది. వరండా వెలుగులో అతని పర్స్ హృదయానికి హత్తుకున్న సరిత కనిపించింది. ఆమె మాటి మాటికీ కళ్ళు తుడుచుకుంటుంది

"ఏయ్! యెందుకు ఏడుస్తున్నావ్ ఆయా?"

"ఆయా కాదు బాబూ అమ్మను...."

"ఛీపో... నువ్వు ఆయావే" అన్నాడు సతీష్.

"పిన్ని అను బాబూ" అన్నది సతీష్ సరితను ఒక్కటి అంటించి పరుగెత్తాడు. ఆమె పిండి రుబ్బుతుండగా, పాలవాడు వచ్చాడు. పాలు పోయించుకుంది. "మీ అమ్మగారు లేరా?" అన్నాడు అమ్మగారన్న పద ఒత్తి పలుకుతూ. "యెవరింటికి వెళ్లింది" నెమ్మదిగా అన్నది.

"ఛీ ..ఛీ ... ఇంత రాక్షసత్వంయెక్కడా చూడలేదు. పనిమనిషిని మాన్పించింది వంట మనిషిని మాన్పించింది. రేపటి నుండి పాలకు మా ఇంటికి మిమ్మల్నే పంపుతుంది" అన్నాడు కసిగా.

"స్వామెప్పు తాతా! అమ్మొచ్చిందంటే గొడవ...." అన్నది భయంగా దిక్కులు చూస్తూ.

"మీకు నోరు లేదని గొడవ చేస్తుంది. అయినా ఆయన కెంత బుద్ధి లేదు కట్టుకున్న దాని బాగోగులు పట్టించుకోడూ. ఏం మగదమ్మా...."

"ఆయనేం అనరు తాతా. ఆయన కేం తెలియదు...." అంటుండగానే వీధి తలుపు వేసిన శబ్దంతో పాటు పిడుగులాంటి ప్రశ్న వచ్చింది.

"పాల వాడితో సరసాలు ఆడుతున్నావటే దిక్కుమాలినదానా? నిన్ను గెంటించటం ఒక్క నిమిషం పట్టదు అసలు పిడాకులు యిస్తానంటే నేనే వద్దన్నాను" అన్నది దర్పంగా.

"అమ్మా! మీకిది న్యాయమా? నేనేమంటున్నాను?"

"అనవని ఏం నమ్మకం? మొన్న నా కన్నుగప్పి తలుపు తీయాలనుకోలేదూ?"

"ఆయన నా మీద కోపంతో బయటికి వెళ్లారు. ఏమవుతుందోనని భయంతో మేలుకున్నానే తప్ప, ఆయన యెదుట పడాలని కాదు"

"పడితే ఫలితం తెలుసుగా. నాకూ పిల్లలకు వడ్డించు. పొద్దుట సతీష్ కలిపి వదిలిన అన్నం వుంది. అది తిను" అన్నది.

"అలాగే...."

"ఏమిటా జాకెట్టు మరక పడింది. సబ్బు పెట్టావా?"

"లేదమ్మా. పొరపాటుగా చాకలి బట్టల్లో పడింది. జాకెట్లు చిరిగాయి. ఇదొక్కటే ఉంది" అన్నది మెల్లగా.

"అయితే నావి పాత రవికెలున్నాయి తీసుకో. గుర్తుందా, అబ్బాయి ఈ రోజు ఆలస్యంగా వస్తాడు. తలుపు నేనే తీయాలి?"

"అమ్మా! రోజూ మీకా అనుమానం యెందుకు? ఆయనతో చెప్పి ఆయన సంపాదించింది సగం వ్రాయించుకుని నన్ను వదిలివేయమ్మా."

అతే సరిత చెప్పమంది. తల కాస్త ముందుకు వంచాడు చంద్రం. చెంపలు పట్టుకుని కూర్చుంది సరిత. అపర కాళికా నిల్చుంది లక్ష్మీనర్సమ్మ. ఓ కొత్త రూపం చూచాడు. చంద్రానికే కాళ్లలో ఒణుకు పుట్టింది.

"నువ్వు....నువ్వు....దిక్కు దివాణం లేని మనిషివి. నా మనుమలతో సగభాగం కావాలిటే! మళ్లీ అలాంటి మాటలన్నావంటే, రేపు నీ శవం బజార్లో పడుతుంది. నా కూతురు అనుభవించలేనిది ఏదీ నువ్వు అనుభవించటానికి వీల్లేదు. నువ్వు పిల్లలకు నౌకరువు గురుండా. వెయ్యి కళ్లతో నిన్ను చూస్తుంటానే" ఆమె గదిలోకి వెళ్లింది.

"మైగాడ్...." చంద్రం మతిపోయింది. యెంత ప్రమాదం జరిగేది! తను బయటికి వెళితే ఇద్దరూ బయటికి వెళ్లటం దుర్భరం అవుతుందేమో. అతనికి గడి దాటి బయటికి పోవాలంటే భయంగా ఉంది. రాత్రంతా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు.

అయిదు గంటలకు సరిత లేచి వంటింట్లోకి వెళ్లగానే పిల్లిలా బయటపడి, ముందుకు వచ్చి బెల్ కొట్టాడు.

లక్ష్మీనర్సమ్మ తలుపు తీసింది.

"రాత్రంతా నీకోసమే చూచాను కానీ పుడగే అమ్మా అంటే మొద్దు నిదుర పోయింది...." అన్నది.

"సారీ అత్తయ్యా! అక్కడికి యెవరో వచ్చారు. బొంబాయినుండి అందమయిన అమ్మాయిలను తెచ్చారు..." అని క్రీగంట ఆమెవంక చూచాడు. ఆమె కళ్లు మిలమిల లాడటం గమనించాడు.

"అత్తయ్యా! ఆమెను తయారుకమ్మను. వాళ్ళ నాన్నకు ఆరోగ్యం బావుంటలేదుట" అన్నాడు.

"ఇప్పుడామెను పంపిస్తావా?"

"కూతురినే తలుచుకుంటున్నాడట. నాల్గు రోజులుండి వస్తుంది". అన్నాడు నిర్లక్ష్యంగా

"ఏదయినా ఆస్పత్రిలో చేర్పించరాదు నాయనా! ఈవిడ వెళ్ళి చేసేది ఏముంది!" అన్నది

"అంతగా అయితే రేపే వస్తుందిలే అత్తయ్యా. బ్యాంకులో అందరి ముందు అడిగింది ఆ తల్లి మళ్ళీ వస్తుందేమో.." అని బాత్ రూమ్‌లో దూరాడు. మళ్ళీ మెల్లగా తలుపు తీసుకుని వచ్చాడు.

"అబ్బాయి అనుమానిస్తాడని పంపుతున్నాను. నోరు విప్పావంటే నీ భర్తే నీకు దక్కడు. అర్థం అయిందా?" అన్నది హూంకరింపుగా.

"ఒట్టమ్మా! ఆయన అడిగినా ఏం చెప్పను"

"మీ వాళ్ళు ఏడ్చి చావటం దేనికి? రెండేసి బంగారు గాజులు, సూత్రంతాడు వేసుకుని వెళ్ళు...." అంటుంది.

అతను నవ్వుకుని వెనక్కు వచ్చేసాడు.

అతను తయారయి వచ్చే సరికి, సరిత బ్యాగ్ పట్టుకుని, తను ఈ మధ్య కొన్న వాయిల్ చీర కట్టుకుని తయారయింది.

"రిక్షా మాట్లాడుకుని వెళ్ళు, పనిమనిషి, వంట మనిషి లేరన్న సంగతి తెలుసుగా, రేపు ఉదయం వరకు వచ్చేయి" అన్నది లక్ష్మీనర్సమ్మ.

తల వంచి వెళ్ళిపోయింది సరిత. చంద్రం అత్తగారు వడ్డించిన భోజనం చేసి, స్కూటర్ తీసుకు వచ్చాడు. మెల్లగా అత్తగారింటి వైపు పోనిచ్చాడు. అతనికి తెలుసు వాళ్ళంతా ఆశ్చర్యపోతారని.

"అల్లుడలా యెందుకు చెప్పాడమ్మా. అయినా మీ అమ్మ బ్యాంకకు వెళ్ళి అల్లుడితో మాట్లాడుతుందా?" అది సరిత తండ్రి గొంతు.

"ఏమయితే నేం? ఇన్నాళ్ళకు వచ్చింది. పెళ్ళి కూరలు పెట్టండి చిక్కిపోయింది నా తల్లి..." అంటుంది తల్లి.

చంద్రాన్ని చూచి సరిత ఉలిక్కిపడింది. భయంతో బిగుసుకుపోయింది.

"క్షమించండి మావయ్యా! మా అత్తయ్య నుండి తప్పించటానికి మీకు లేని రోగం అంటగట్టాను". అన్నాడు కూర్చుని.

అత్తగారు కంగారుగా భుజాల మీదుగా పమిటి లాక్కుంది

"కూర్చోనాయనా! ఇప్పుడే వస్తాను" సంచీ పట్టుకుని, ఆయన బయటికి వెళ్లిపోయాడు.

"కాఫీ తెస్తాను..." అత్తగారు లోపలికి వెళ్ళింది.

"సరూ... ఇలారా...."

సరితకు ఆ పిలుపు అమృత వర్షంలా వుంది. స్వప్నంలోలా నడిచి అతని దగ్గరకు వచ్చింది. ఆమెను అలా తన వడిలోకి లాక్కున్నాడు "సరూ! నన్ను హంతకుడిగా చూడాలని! ఒక్కమాట నాతో అన్నావా?" ఆశ్చర్యంగా భర్తను చూసింది.

"రాత్రి నేను చాలా త్వరగావచ్చి గదిలో ఉన్నాను కాబట్టి వినగలిగాను" అన్నాడు ఆమె పొట్టలో ముద్దు పెట్టుకుంటూ.

సరిత భర్త మెడను చేతులు వేసి వెక్కి వెక్కి ఏడ్చింది.

"నన్నేం చేయమంటారు చెప్పండి. తను అన్నదానికి వ్యతిరేకంగా జరిగితే మిమ్మల్ని ఈ ప్రపంచంలో లేకుండా చేస్తానన్నది" అన్నది భయంగా

"అర్థం అయింది సరూ...." అన్నాడు.

"తల్లి నవుతానని అనుకున్న మరుక్షణం యెంతో ఆనందంతో మీకు చెప్పాలనుకున్నాను. కాని ...కాని నేను తల్లిని కావటానికి వీల్లేదన్నది ఏడ్చాను, బ్రతిమాలాను.." అతని భుజంపై తల వాల్చింది.

"సరూ! అత్తయ్యను నిందించను. ఆమె కూతురుకు దొరకనిది నువ్వు తన కళ్లముందే అనుభవించటం సహించలేకపోతుంది. నిన్ను తన్ని తగిలేస్తే పిల్లలను నమ్మకంగా చూచుకునే వారు కావాలి. నిన్ను వదులుకోలేంపోతుంది" అన్నాడు ఆర్తిగా.

"మొదట అంత కసి పెంచుకోలేదండీ. నాకు...నాకు..." చెప్పలేకపోయింది

"నువ్వు గర్భవతివని తెలిసాక మరీ పిచ్చెక్కింది అవునా?"

"ఊఁ..." అతనిచుట్టూ చేతులు వేసి.

"నువ్వు చాలా పెద్దదానివి. ఇంత సంతోషవార్త నాకు చెప్పావా?" అన్నాడు నిష్ఠూరంగా,

"మీ మొదటి భార్య గర్భవతి అయి పోయిందని, మీకు తెలిసే ఇంట్లోనుండే తరిమేసారని, అబార్షన్‌కోసం ఇంజక్షన్ ఇప్పిస్తానని బెదిరిస్తే యెలా చెప్పను? అన్నది బాధగా.

ఉన్నవి రెండు గదులు, వరండా. సరిత తల్లి అల్లుడికి కాఫీ తెచ్చి, అల్లుడిని, కూతుర్ని ఆస్థితిలో చూచి వెనక్కు వెళ్లింది.

"సరూ....కాఫీ తీసుకెళ్లమ్మా" అన్నది.

సరిత ఉలిక్కిపడింది. భర్త వడిలోనుండి లేచింది. కాఫీ తీసుకువచ్చి ఇచ్చింది.

"నేను భోజనం కూడా చేశాను. మా అత్తయ్య పుణ్యమా అని రాత్రి అన్నం పారేశావు. ఉదయం టిఫిన్లయినా ఇచ్చిందో లేదో...." అని కాఫీ ఆమెకే ఇచ్చాడు. కాఫీ త్రాగింది.

"మీ అత్తయ్యకు నేనంటే యెందుకో ఆ కసి! నేను మాట్లాడితే కోపం, పడుకుంటే పనులు నీవా అటుంది. కూర్చుంటే కుర్చీలు నీ పుట్టింటివారిచ్చారా అంటుంది. తలుచుకుంటే భయం వేస్తుంది ఇప్పుడెలా?" అన్నది భయంగా.

"నాకు ట్రాన్స్‌ఫర్ వస్తే వద్దన్నాను అంగీకరిస్తాను. నిశ్చింతగా వుండు. అన్నాడు లేస్తూ.

"మీరు వెళ్ళగానే ఆమె వస్తుందని భయం వేస్తుందండీ" అన్నది అతని చెయ్యి పట్టుకుని,

"ఆ ఇంట్లో వుండి భయపడితే అర్థం వుంది. మనము బయటికి వచ్చేసాం. మనిషికి ప్రథమ శత్రువు యెవరో తెలుసా? పిరికితనం. అభాగ్యురాలయిన ఓ తల్లి ఆమె. నేను సాయంత్రం వచ్చి యెప్పుడు వెళ్లేది చెబుతాను. ఆమె అంతర్యం తెలిసినట్టు నటిస్తే ఆమెకు బాధ కల్గుతుంది" అన్నాడు ధైర్యం చెబుతూ

ఆమె తలాడించింది. ఆమెకెంతో ఆనందంగా, ఉత్సాహంగా వుంది. భర్త స్కూటర్ కనిపించినంత మేరకు చెయ్యూపింది ✱